



నేడు తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

- కలెక్టరేట్‌లో పూర్తయిన ఏర్పాట్లు
- అమరవీరులకు నివాళి

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర 11వ ఆవిర్భావ వేడుకలకు జిల్లా ముస్తాబైంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ జెండాను కలెక్టర్ వీపీ గౌతమ్ ఆవిష్కరించనున్నారు. తొలుత మయూరిసెంటర్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం 8:30కి బైపాస్‌రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టర్ గౌతమ్ నివాళులు అర్పిస్తారు. ఆ తర్వాత 9గంటలకు ఐడీఓసీలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం పదేళ్ల జిల్లా ప్రగతిపై కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల కోసం ఐడీఓసీ కార్యాలయాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా అమరవీరులను స్మరించుకోనున్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన 8 మంది అమరవీరుల కుటుంబాలను గుర్తించి హైదరాబాద్‌లో జరిగే వేడుకలకు పంపించారు. ఉద్యమంలో పాలుపంచుకున్న 150మందిని ఎంపికచేసి ప్రత్యేక బస్సుల్లో వారిని హైదరాబాద్ వేడుకలకు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత ఆదివారం సాయంత్రం లకారం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అక్కడ సంబురాలతో పాటు ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు.

వెలుగు నీడల పయనం



సకల జనుల సమరశంఖంతో సాకారమైన తెలంగాణ రాష్ట్రానికి నేటితో (జూన్ 2) పదేళ్లు పూర్తవుతున్నాయి. తెలంగాణ... రాష్ట్రంగా అవతరించినప్పుడు, స్వపరిపాలన మొదలైనప్పుడు ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై భిన్న వర్గాల వారు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.. ఆకాంక్షలు నెరవేరుతాయని కలగన్నారు. అయితే గత దశాబ్దకాలపు పయనంలో సాధించింది కొంతైతే, సాధించాల్సింది ఎంతో వుంది. గడచిన పదేళ్లలో అభివృద్ధి పనులకు రూ.50వేల కోట్లు వెచ్చించినట్టు లెక్కలు చెబుతున్నా.. అవి ఆచరణలో సమగ్రంగా కనిపించడం లేదు. వ్యవసాయ, పారిశ్రామిక, సాగునీటి రంగాల్లో ఆశించిన అభివృద్ధి జరగకపోవడం నిరాశపరిచే అంశం. రహదారులు, పట్టణీకరణ, ఇతర మౌలిక సదుపాయాల పరంగా కొంత మెరుగ్గానే కనిపించినా, విద్యారంగంలో జరగాల్సినంత జరగలేదు. యూనివర్సిటీ కల సాకారం కాలేదు. భద్రాద్రి, జమలాపురం ఆలయాలు అభివృద్ధికి నోచుకోక పోగా, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు జాడలేకుండా పోయింది. ప్రస్తుత ప్రభుత్వంలో జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో వచ్చే ఐదేళ్లు అభివృద్ధిపై ఆశలు పెంచుకోవడం అత్యాశ కాదేమో!

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

పదేళ్ల తెలంగాణలో పూర్తిగా నెరవేరని ఆకాంక్షలు

- ఉమ్మడి జిల్లాలో ప్రగతి పరంగా మిశ్రమ ఫలితాలు
- జరిగింది కొంత... జరగాల్సింది ఎంతో...
- కొనసా...గుతున్న 'సీతారామ, సీతమ్మసాగర్'
- జాడలేని బయ్యారం ఉక్కు పరిశ్రమ
- దశాబ్ది పయనంలో కలగానే యూనివర్సిటీ
- అభివృద్ధికి నోచుకోని భద్రాద్రి, జమలాపురం ఆలయాలు
- వెలుగులు నింపుతున్న భద్రాద్రి పవర్ ప్రాజెక్టు
- పరుగులు పెడుతున్న జాతీయ రహదారుల పనులు
- ఖమ్మం నగరానికి కొత్తరూపు
- ముగ్గురు మంత్రులపైనే ఉమ్మడి జిల్లా ఆశలు

5



4

ఉద్యమంలో నాపై 153 కేసులు పెట్టారు...

- అయినా వెనకడుగు వేయలేదు
- పబ్లిక్ ప్రాపర్టీ డ్యామేజీ మొదటి కేసు నా మీదే
- కేసీఆర్ ఏ1 అయితే, నేను ఏ2గా వున్నాను..
- రౌడీషీట్ ఓపెన్‌చేసి ఎనిమిదేళ్లు అలాగే ఉంచారు
- తెలంగాణ ఉద్యమకారుడు పానుగోటి సంపత్



ఖమ్మం రూరల్ మండలంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

అర్హులందరికీ త్వరలోనే రేషన్ కార్డులు

- బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదవారి కలలు కల్లలయ్యాయి..
- రాష్ట్రంలోనే పాలేరును మోడల్‌గా తీర్చిదిద్దుతా : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

5

GMR జీఎమ్ఆర్ హైదరాబాద్ విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్

25/1, స్కిప్ హౌస్, మ్యూజియం రోడ్, బెంగళూరు 560 025.
కన్సెషనర్ యొక్క ప్రమోటర్స్: జీఎమ్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్.

CIN U45201KA2009PTC050109

పంతంగి టోల్ ప్లాజా (కి.మీ 60 + 650), కొర్లపహాడ్ టోల్ ప్లాజా (కి.మీ 118 + 250) మరియు చిల్లకల్లు టోల్ ప్లాజా (కి.మీ 205 + 025) ల వద్ద తేది 3 జూన్ 2024 నుండి అమలు చేయబడనున్న టోల్ ఫీజు యొక్క వార్షిక సవరణకు సంబంధించిన బహిరంగ ప్రకటన.

1. ప్రజానీకానికి అందరికీ ఇందు మూలంగా తెలియచేయునది ఏమనగా టోల్ ఫీజు యొక్క వార్షిక సవరణకు సంబంధించిన NHAI అనుమతి లెటరు తేది 26.03.2024 ప్రకారం, జాతీయ రహదారి నెం. 9 (కొత్త నెం. 65) యొక్క హైదరాబాద్ విజయవాడ సెక్షన్ కి.మీ 40.00 నుండి కి.మీ 221.500 నకు సంబంధించి, తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి జిల్లా పరిధి లోని పంతంగి టోల్ ప్లాజా (Chainage: km 60 + 650), నల్గొండ జిల్లా పరిధిలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా (Chainage:km 118 + 250) మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలోని చిల్లకల్లు టోల్ ప్లాజా (Chainage:km 205 + 025) ల వద్ద వినియోగదారుని ఫీజు యొక్క వార్షిక సవరణ దిగువ తెలిపిన విధంగా తేది 3 జూన్ 2024 నుండి వర్తించును.

(Amount in Rs.)

వాహనం రకం	(60 + 650 కి.మీ)			(118 + 250 కి.మీ)			(205 + 025 కి.మీ)		
	గ్రామం - పంతంగి			గ్రామం - కొర్లపహాడ్			గ్రామం - చిల్లకల్లు		
	సింగిల్ జర్నీ	రిటర్న్ జర్నీ	నెలసరి పాస్ (50 ట్రిప్స్)	సింగిల్ జర్నీ	రిటర్న్ జర్నీ	నెలసరి పాస్ (50 ట్రిప్స్)	సింగిల్ జర్నీ	రిటర్న్ జర్నీ	నెలసరి పాస్ (50 ట్రిప్స్)
కార్, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటారు వాహనం	95	145	3200	130	195	4335	110	160	3610
లైట్ కమర్షియల్ వాహనం, లైట్ గూడ్స్ వాహనం లేదా మినీ బస్	150	230	5055	205	310	6880	170	255	5700
బస్ లేదా ట్రక్ (2 యాక్సిల్)	315	470	10455	430	640	14265	355	530	11785
హెచ్‌సిఎమ్/ఇఎమ్‌వి లేదా మల్టీ యాక్సిల్ వాహనం (ఎమ్ఎవి) (3 నుండి 6 యాక్సిల్)	485	725	16155	665	995	22120	545	820	18215
పెద్ద వాహనాలు (7 లేదా మరిన్ని యాక్సిల్స్)	605	910	20225	825	1240	27525	685	1025	22810
టోల్ ప్లాజాకు 20 కి.మీ సరిహద్దు పరిధిలో నివసిస్తున్న మరియు నాన్ కమర్షియల్ ఉద్దేశ్యం ప్రకారం రిజిస్టరు చేసుకున్న స్థానిక కారు/జీపు/వాన్ వాహనాలకు 2024-25 సం॥ నకు గాను రూ. 340/- నెలసరి పాస్ వర్తిస్తుంది.									

2. పైన పేర్కొనబడిన రేట్లు
   i) పంతంగి టోల్ ప్లాజా వద్ద 45.45 కి.మీ రహదారి పొడవు మరియు 51.60 కోట్ల ఖర్చుతో నిర్మించిన 4 కి.మీ బైపాస్ పొడవు కలిపి మొత్తం 49.45 కి.మీ పొడవునకు వర్తించబడును.
   ii) కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద 67.130 కి.మీ రహదారి పొడవు మరియు 60.00 కోట్ల ఖర్చుతో నిర్మించిన 5.15 కి.మీ బైపాస్ పొడవు కలిపి మొత్తం 72.280 కి.మీ పొడవునకు వర్తించబడును.
   iii) చిల్లకల్లు టోల్ ప్లాజా వద్ద 50.780 కి.మీ రహదారి పొడవు మరియు 62.22 కోట్ల ఖర్చుతో నిర్మించిన 9 కి.మీ బైపాస్ పొడవు కలిపి మొత్తం 59.780 కి.మీ పొడవునకు వర్తించబడును.
3. పైన పేర్కొన్న టోల్ ప్లాజాల వద్ద దిగువ తెలిపిన రాయితీలు వర్తింపబడును.
   i) తిరుగు ప్రయాణానికి సంబంధించి టికెట్ కొనుగోలు చేసిన సమయం నుండి 24 గంటల సమయం వరకు అన్ని రకాల వాహనాలకు రుసుములో 25% మినహాయింపు వర్తించును.
   ii) నెలసరి పాస్ తీసుకున్న వాహన దారులు పాస్ ధర చెల్లించిన దగ్గర నుండి ఒక్క నెలలో 50 లేదా అంతకంటే ఎక్కువ ఒక వైపు ట్రిప్పులు వాడుకునే అన్ని రకాల వాహనాలకు రుసుములో 33% మినహాయింపు వర్తించును.
   iii) టోల్ ప్లాజా కు 20 కి.మీ పరిధిలో నివసిస్తూ నాన్ కమర్షియల్ ఉద్దేశ్యం ప్రకారం రిజిస్టరు చేసుకున్న స్థానిక వాహనాలకు ఒక్క కాలెండరు నెలకు నెలసరి పాస్ రేటు రూ. 340/-
4. టోల్ రుసుము మినహాయింపు ఇచ్చిన వాహనాల యొక్క లిస్టు తేది: 06.06.2012 న ఫీ నోటిఫికేషన్‌లో ఇవ్వబడింది.
5. పరిమితికి మించి బరువు కలిగిన వాహనాలపై పది రెట్లు అదనపు ఫీజు వర్తించును మరియు అదనపు బరువు ను తీసివేసిన తరువాతే రహదారిపై సదరు వాహనమును అనుమతించబడును.
6. తేది: 09.10.2009 నాటి కన్సెషన్ అగ్రిమెంట్ ప్రకారం కన్సెషన్ పిరియడ్ 2035 సం. వరకు కొనసాగబడును. కన్సెషన్ అగ్రిమెంట్ కాల పరిమితి పూర్తి అయిన పిమ్మట టోల్ ఫీజు 40% కు తగ్గించబడును.
7. తేది:06.06.2012 న గెజిట్‌లో ప్రచురించబడిన ఫీ నోటిఫికేషన్,తేది 26.03.2024 న NHAI చే అనుమతి పొందిన టోల్ ఫీజు యొక్క వార్షిక సవరణ రేట్లకు సంబంధించిన లెటరు మరియు కన్సెషన్ అగ్రిమెంట్ యొక్క ఇతర నిబంధనలకు http://nhtis.org ను చూడగలరు.
8. ఏదైనా సమాచారం/ఫిర్యాదులు/సలహాల నిమిత్తం ఈ దిగువ తెలిపిన పేరు మరియు చిరునామాలో సంప్రదించగలరు:

	కన్సెషనర్	ఇండిపెండెంట్ ఇంజనీర్	NHAI యొక్క PIU
ప్రతినిధి పేరు	శ్రీ. కెవియస్‌యస్ శ్రీకాంత్	శ్రీ. వి.ఎస్.ఎస్. సాయికుమార్ సీతంశెట్టి	శ్రీ. పి. నాగేశ్వర రావు
చిరునామా	మేస్సర్స్. జిఎమ్ఆర్ హైదరాబాద్ విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వేస్ ప్రై. లి. టోల్ ప్లాజా - 2, కి.మీ 118+250, కొర్లపహాడ్ గ్రామం కేతెపల్లి మండలం నల్గొండ జిల్లా తెలంగాణ - 508 211.	మేస్సర్స్. అర్వీ అసోసియేట్స్ ఇం.నం. 1-2-270-103/B/7, 1వ అంతస్తు, కృష్ణానగర్ కాలనీ, రోడ్ నం. 03, సూర్యాపేట్, తెలంగాణా - 508213.	నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవే) ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్, 25ఎ అండ్ 28ఎ, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ), కాలేజ్ పార్క్ క్యాంపస్ రోడ్ నం. 3, బంజారా హిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ.
మొబైల్ నెం:	+ 91-7318082840	+ 91-8121003908	+91-9437037066

a) గెజిట్ల నెం.జి ఎస్ ఆర్ (298E): ఫాస్టాగ్ లేని మరియు చెల్లుబాటి కానీ వాహనములు ఫాస్టాగ్ లైన్ లోకి ప్రవేశించిన ఎడల , ఆ వాహన వర్గానికి చెల్లుబాటు అయ్యే రెండింతల రుసుము చెల్లించవలెను. ఫీ రూల్ 4 యొక్క ఫీ సబ్ రూల్ (2) ప్రకారము.

b) NHAI/12013/CO/2019-20/147464: భారతదేశం మొత్తంలో టోల్ చెల్లింపుల కోసం ఫాస్టాగ్ మరింత చొచ్చుకుపోవడం మరియు విస్తృతంగా ఉపయోగించడాన్ని ప్రారంభించడానికి, రిటర్న్ ఛార్జీల తగ్గింపు వంటి టోల్ ప్లాజాపై వర్తించే అన్ని రాయితీలు/ తగ్గింపు, స్థానిక మినహాయింపు ఫాస్టాగ్ ద్వారా మాత్రమే చెల్లించే టోల్ చెల్లింపులకు పరిమితం చేయబడుతుంది.

GMR GROUP - HVE / 9-I / PREM ASSOCIATES - TEL

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే..
తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

- గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్
- గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

- నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

- 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక
- రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసుకొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న
- ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహా ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ ప్రాత ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎస్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

పోరు బావుటా... కొలిశెట్టి రాందాస్



ఇల్లెందు, జూన్ 1: తెలంగాణా రాష్ట్రం కోసం ప్రప్రథమంగా పోరుబాటకు ఉమ్మడి ఖమ్మం జిల్లా లోనే బీజంపడింది. ఇల్లెందు సమీపంలోని గేటు కారేపల్లి గ్రామంలో జన్మించిన కొలిశెట్టి రామదాస్ సింగరేణిలో ఉద్యోగి. పాల్వంచలో ప్రత్యక్షంగా కేటీపీఎస్‌లో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా యువకులను చైతన్య పరిచి 1968లోనే ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమానికి నాంధీ పలికారు. తెలంగాణా ప్రాంతీయ సమితిని నెలకొల్పాడు. 1969లో ఇల్లెందులో కొలిశెట్టి రాందాస్, కొటిశెట్టి భిక్షపతి, చొప్పరి రాజమల్లు, మిర్యాల రామరావు, కొలిశెట్టి నాగేశ్వర రావు, కైరి లక్ష్మీనారాయణ, ఆడెపు రాంచందన్, తదితరులు ఆంధ్రా గోబ్యాక్‌అంటూ నాన్‌ముల్కీ ఉద్యమాన్ని చేపట్టారు. నిరాహార దీక్ష చేస్తున్న యువకులను అప్పటి పోలీస్ సీఐ చేతన్ అరెస్ట్ చేసి తీవ్రంగా కొట్టారు. కొలిశెట్టిని అరెస్ట్ చేశారాన్న సమాచారంతో ఆగ్రహించిన ఇల్లెందు ప్రజలు మూకుమ్మడిగా సీఐ చేతన్‌పై దాడికి యత్నించారు. పోలీస్ స్టేషన్ ముట్టడించారు. భయపడిన పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి లాఠీచార్జీ చేయడంతో పలువురు గాయపడ్డారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత.. తిప్పనిసిద్దులు



భద్రాచలం, జూన్ 1: ఉమ్మడి వరంగల్ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన తిప్పన సిద్దులు విద్యార్థి దశలోనే తెలంగాణపై ఉన్న మక్కువతో విద్యార్థి సంఘంలో కీలక శక్తిగా ఎదిగారు. 1969లో ఉద్యమం ఉవ్వెత్తున ఎగుస్తున్న క్రమంలో దీనికి తిప్పని సిద్దులే కారణమవుతున్నారని ఆనాటి ఏఎస్పీ హెచ్‌జే దొర భావించారు. ఒకానొక దశలో వరంగల్ రైల్వే గేటు వద్ద ఆయన్ను హతమార్చేందుకు ప్రయత్నించారు. పోలీసు శాఖలో పని చేస్తున్న సిద్దులు అన్న రాములు ఉప్పందించడంతో వరంగల్‌లోని లక్ష్మీ సినిమా థియేటర్‌లో ఆయన్ను అరెస్టు చేశారు. 1969 ఉద్యమంలో ఇంతటి పోరాట ఘనతను దక్కించుకున్న సిద్దులు తాను విద్యార్థి దశ నుంచి ప్రభుత్వ అధ్యాపకుడిగా మారినా తన పంథాను మాత్రం వీడలేదు. వీలు చిక్కినప్పుడల్లా తెలంగాణ ప్రాంతంలోని వివిధ చోట్ల తన ఉపన్యాసాలతో తెలంగాణ వాదుల్లో ఉద్యమ స్ఫూర్తిని రిగిలించారు. వృత్తి రీత్యా భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు.

అగ్గిబరాట.. 'అన్నాబత్తుల'



ఖమ్మం సాంస్కృతికం, మే 31: మా ఉద్యోగాలు మాగ్గావాలె.. నాన్ ముల్కీ గోబ్యాక్ నినాదాలతో నాడు ఖమ్మం గుమ్మం హోరెత్తింది.. రగల్ జెండాల రెపరెపలతో ఖమ్మం కేంద్రంగా తెలంగాణ ఉద్యమం దద్దరిల్లింది.. స్థానిక యువతకు దక్కాల్సిన ఉద్యోగావకాశాలను తెలంగాణేతరులు తన్నుకు పోతున్న అన్యాయంపై హుంకరించిన పంతొమ్మిదేళ్ల నూనూగు మీసాల యువకుడు తెలంగాణ వ్యాప్తంగా నాడు ఉద్యమాన్ని రగిలించాడు.. అన్నాబత్తుల రవీంద్రనాథ్ అనే డిగ్రీ విద్యార్థి ఖమ్మం గాంధీచౌక్‌లో నిరహార దీక్షకు దిగటంద్వారా మహా ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు.. 1969 జనవరి 8 నుంచి 21వ తేదీ వరకు 14 రోజుల పాటు ఆమరణ నిరహార దీక్ష పాటించటం ద్వారా తెలంగాణ ఏర్పాటుకు పొలికేక వినిపించాడు.

తొలిదశ పోరాటయోధుడు 'పోటు'



పాల్వంచ, మే 31: పోటు కృష్ణమూర్తి... పాల్వంచ నేలపైన తెలంగాణ తొలిదశ ఉద్యమ నెగడును రగిలించిన యోధుడు. పాల్వంచ గట్టాయిగూడెం ప్రాంతానికి చెందిన పోటు సోమయ్య, తులశమ్మల ముద్దుబిడ్డ కృష్ణమూర్తి. ఆయన కేటీపీఎస్‌లో 1968లో హెల్పర్‌గా ఉద్యోగం సంపాదించాడు. కేటీపీఎస్‌లో జెంటిల్‌మెన్ అగ్రిమెంట్‌ను తుంగలో తొక్కుతూ స్థానిక నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారనే ఆందోళన మొదలైంది. ఈ పోరాటాన్ని కొలిశెట్టి రాందాస్, కోలాహలం రాజు, కామాజాన్ ప్రజల్లోకి తీసుకువెళ్లే క్రమంలో వారు కేటీపీఎస్ కార్మికుడు పోటు కృష్ణమూర్తిని పోరాట యోధుడిగా ఎంచుకున్నారు. 1969 జనవరి 10న పోటు కృష్ణమూర్తి తన సహచరులతో కలసి కేటీపీఎస్ కర్మాగారం ఎదుట ఆమరణ దీక్ష చేపట్టాడు. ఆంధ్రాకు చెందిన అధికారులను తక్షణమే వారి ప్రాంతాలకు బదిలీచేస్తామని హామీ ఇవ్వడంతో కృష్ణమూర్తి 1969 జనవరి 23న దీక్ష విరమించాడు.



సంపత్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు (ఫైల్)

అసమాన త్యాగాలు, పోరాటాల ఫలితంగా ఏర్పడిన రాష్ట్రం... తెలంగాణ. వర్గాలకు అతీతంగా ప్రజలందరూ తెలంగాణ నినాదాన్ని గొంతెత్తి చాటారు. ప్రాణాలు పణంగా పెట్టి మరీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. భిన్న వర్గాల వారు ఒకేతాటిపైకి వచ్చి జేఏసీగా ఏర్పడి ఉద్యమంలో పాలుపంచుకున్నారు. ఉద్యమకారులు అనేక కేసులు ఎదుర్కొన్నారు. ఎందరో జైలు జీవితాలను అనుభవించారు. ఒక్కొక్కరిదీ ఒక్కో గాథ. స్వార్థం అనేదే లేకుండా కేవలం తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఆకాంక్షతో జీవితాలను త్యాగం చేసిన యువకిశోరాలు ఎందరో. వారిలో ఖమ్మం నగరానికి చెందిన పానుగోటి సంపత్‌ది ఆసక్తికరమైన కథ. ఉద్యమ జీవితంలో 153 కేసుల్లో ఆయన నిందితుడిగా నమోదయ్యారు. అప్పటి పోలీసులు టార్గెట్ చేసి రౌడీషీటర్‌గా పోలీసు రికార్డుల్లోకి ఎక్కించారు. ఓ కేసులో కేసీఆర్‌ను ఏ1గా, సంపత్‌ను ఏ2గా చూపించారు. అయినా సంపత్ మడమ తిప్పలేదు. ఖమ్మం కేంద్రంగా తెలంగాణ పోరును దూకుడుగా కొనసాగించారు. యువజన సంఘాల జేఏసీ రాష్ట్ర కో చైర్మన్‌గా ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆయన ఉద్యమ జీవితాన్ని స్పృశించే ప్రయత్నం ఇది. వివరాలు ఆయన మాటల్లోనే...

\- ఆంధ్రజ్యోతి, ఖమ్మం



ఉద్యమంలో నాపై 153 కేసులు పెట్టారు

- అయినా వెనకడుగు వేయలేదు
- పబ్లిక్ ప్రాపర్టీ డ్యామేజీ మొదటి కేసు నామీదే
- కేసీఆర్ ఎ1 అయితే, నేను ఎ2గా వున్నాను..
- రౌడీషీట్ ఓపెన్‌చేసి ఎనిమిదేళ్లు అలాగేఉంచారు
- గత పదేళ్లలో మేం కలగన్న ఆకాంక్షలు నెరవేరలేదు
- తెలంగాణ ఉద్యమకారుడు పానుగోటి సంపత్

నేను 19 ఏళ్ల వయస్సులో విద్యార్థి విభాగం ద్వారా తెలంగాణ ఉద్యమంలోకి అడుగుపెట్టా. సామాజిక తెలంగాణ సాధనకోసం చేపట్టిన ఉద్యమంలో భాగంగా పలు నిరసన కార్యక్రమాలు, ధర్నాలు, నాయకుల అడ్డగింతలు వంటి కార్యక్రమాలు నిర్వహించాం. ఈ క్రమంలోనే పోలీసులు బైండోవర్లు వంటివి మినహాయిస్తే నాపై 153 కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. సుమారు 60కి పైగా కేసుల్లో ఏ1గా పెట్టారు. రాష్ట్రసాధన కోసం చేపట్టిన నిరసనల్లో భాగంగా పెట్టిన కేసుల్లో అత్యధిక కేసులు ఉన్న రెండో వ్యక్తిని నేనే.

ఉద్యమ సమయంలో ఖమ్మం పోలీసులు నాపై రౌడీషీట్ కూడా తెరిచారు. ఎనిమిదేళ్లపాటు రౌడీషీట్‌ను అలాగే ఉంచారు. అప్పట్లో టీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగంలో పనిచేసిన నేను.. ఆ తర్వాత కోదండరాం నేపథ్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ యువజన సంఘాల జేఏసీ రాష్ట్ర కో చైర్మన్‌గా కొనసాగుతూ వచ్చాను. ఆయన నేతృత్వంలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాం. ఖమ్మం గాంధీచౌక్‌లో పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని ధ్వంసం చేసినందుకుగాను పబ్లిక్ ప్రాపర్టీ డ్యామేజీ (పీపీడీ) కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో ఉద్యమానికి సంబంధించి మొదటి పీపీడీ కేసు అదే. ఆ కేసులో 45 రోజులపాటు జైలులోనే గడిపాను.

కాయిన్‌బాక్స్ నుంచి కాల్ చేయించి...

మలిదశ ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన దీక్షాదివస్‌లో భాగంగా ఖమ్మానికి వస్తున్న రోజున నా పుట్టిన రోజు. ఆ రోజు కొత్తగూడెంలోని గణేష్ టెంపుల్‌లో పూజ కోసం వెళ్తున్నప్పుడు పోలీసులు ఫోన్ చేశారు. ఎక్కడున్నావనీ అడిగినప్పుడు పలానా చోట ఉన్నా అని చెబితే కాయిన్ బాక్స్ నుంచి ఫోన్ చేయాలని ఆదేశించారు ఓ అధికారి. ఆ తర్వాత కన్ఫామ్ చేసుకుని గుడిదగ్గర నన్ను అరెస్ట్ చేసి ఖమ్మం తీసుకొచ్చారు. ఆ తర్వాత కేసీఆర్‌ను ఏ1గా చూపించి ఆ తర్వాత నాపేరు పెట్టారు. సబ్‌జైలులో రెండు రోజులపాటు మెడికల్ బ్యారక్‌లో ఆయనతోపాటే ఉన్నా. మరో రెండు రోజుల తర్వాత ఆయన్ను తీసుకెళ్లారు. ఎనిమిది రోజుల తర్వాత నాకు, నాతోపాటు ఉన్న మరి కొందరికి బెయిల్ వచ్చింది.

ఉద్యమ సమయంలో పోలీసులు రాత్రుళ్లు ఫోన్ చేసేవారు. ఒంటరిగా నిర్బంధించి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి టార్చిలైట్ల వెలుతురులో చివరి కోరిక ఏంటో కోరుకోమంటూ బెదిరించేవారు. నేను మాట వినకపోవడంతో మా కుటుంబసభ్యులను కూడా వేధించేవారు. కోర్టులో హాజరుపరచడానికి తీసుకెళ్లినప్పుడు ఒకేసారి పది నుంచి పదిహేను కేసుల్లో ముద్దాయిగా పిలుస్తూ ఉండేవారు. తట్టుకోలేక జడ్జిగారిముందు ఇక్కడే ఒకగది కట్టించండంటూ వాపోయాను.

నేను చచ్చిపోయా అనుకున్నారు..

2010 మే 28న ఓదార్పు యాత్ర కోసం జగన్ మహబూబాబాద్‌కు వస్తున్నాడని తెలిసి కోదండరాం నేతృత్వంలో ఆయన్ను అడ్డుకునేందుకు నిరసన కార్యక్రమం చేపట్టాం. ముందురోజు నుంచే వందలాదిమంది విద్యార్థులను అక్కడకు చేర్చాం. నిరసన తెలిపే క్రమంలో మాపై బుల్లెట్ల దాడి జరిగింది. ఆ సమయంలో తెలిసిన వాళ్లందరూ నేను చనిపోయాననే అనుకున్నారు. అందులోనూ ఏ1గా పోలీసులు కేసు నమోదు చేశారు. నాటి ప్రభుత్వం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంలో సీఎం వస్తున్నాడని తెలిసి జిల్లా సరిహద్దుల్లో అడ్డుకునేందుకు నిరసన కార్యక్రమం నిర్వహించాం. ఆ సమయంలో పోలీసులు మా నిరసనను భగ్నం చేసే క్రమంలో అక్కడి నుంచి స్టేషన్‌కు తీసుకెళ్లి విచక్షణ రహితంగా గంటపాటు కొట్టారు. ఆ తర్వాత ఆసుపత్రి నుంచి నేను లేచి నడవడానికి నెల రోజులు పట్టింది. ఉద్యమం జరిగే సమయంలో అన్ని వర్గాల వారితో కలిసి పోరాటం చేశాం. ఆ సమయంలో చాలామంది మిత్రులతో కలిసి నా ప్రయాణం సాగించా. వారందరు నాతోపాటు కేసులను ఎదుర్కొన్నవారే. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత నాపై కేసులను ఎత్తివేశారు. రౌడీషీట్‌ను తొలగించారు.

ఆకాంక్షలు నెరవేరలేదు..

కోటి ఆశలతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో గడిచిన పదేళ్లలో ఎలాంటి ఆకాంక్షలు నెరవేరలేదు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఉద్యమంలో ముందడుగు వేశాం. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా జలాల వాటాలో నష్టం జరిగింది. రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మారింది. విద్యార్థులు, యువత ఏ ఉద్యోగాలు వస్తాయని ఆశపడ్డారో అవి కాస్త అడియాసలుగా మారాయి. టీఎస్‌పీఎస్సీ పేరుతో ఉద్యోగాలను అమ్ముకున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులు సైతం ఎలాంటి ఆసరా దొరక్క దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద సమ్మెలో కార్మికులు(ఫైల్)

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సకల జనుల సమ్మెలో సింగరేణి కార్మికులు భాగస్వాములయ్యారు. 42 రోజుల పాటు సకలజనుల సమ్మె జరగ్గా .. 36రోజుల పాటు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిని స్తంభింపచేసి బాసటగా నిలిచారు. బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడంతోదేశంలో ఏడు రాష్ట్రాలకు సంబంధించిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆనాటి కేంద్ర ప్రభుత్వం సకలజనుల సమ్మెపై ఆరా తీసింది.

\- ఇల్లెందు/ రుద్రంపూర్



తెలంగాణా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జిల్లాకు చెందిన ఉద్యమకారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణా అమరవీరులకు నివాళులు అర్పించారు.

\-ఖమ్మం కార్పొరేషన్

వెలుగు నీడల పయనం

పదేళ్ల తెలంగాణలో పూర్తిగా నెరవేరని ఆకాంక్షలు

ఖమ్మం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి నేటితో (జూన్ 2) దశాబ్ది కాలం పూర్తయింది. సకల జనుల పోరాటాల ఫలితంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో.. అభివృద్ధి పరుగులు పెరుగుతుందని, కోరుకున్న ఆకాంక్షలు నెరవేరుతాయని అందరూ ఆశించారు. అయితే 'కొంచెం ఇష్టం.. కొంచె కష్టం..' అన్న తీరుగా అభివృద్ధిసాగింది. గడిచిన పదేళ్లలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కొంత మేర అభివృద్ధి సాధించినా, ఇంకా ఎంతో సాధించాల్సి ఉంది. కొన్ని పనులు పూర్తి కాగా, మరికొన్ని అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. దీర్ఘకాలికంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారం చూడగా సాగునీటి సమస్యమాత్రం ఇంకా తీరలేదు.

ఉమ్మడి రాష్ట్రంలో జిల్లాలో భారీ పరిశ్రమలు వెలవగా ఆ తర్వాత కొత్త పరిశ్రమల ఏర్పాటు కొరత కనిపిస్తునే ఉంది. గత దశాబ్దకాలంలో రూ.50వేల కోట్లతో జిల్లాలో అభివృద్ధి పనులు జరిగాయన్న లెక్కలున్నాయి. రహదారులు, ఇతర మౌళిక సదుపాయాలు పనులు కొంత వేగవంతంగానే సాగాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఈ ఐదేళ్ల అభివృద్ధి కీలకం కాబోతుంది. గతంలో ఎన్నడు లేని విధంగా జిల్లాకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్‌శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురు దృష్టి సారిస్తే జిల్లా అభివృద్ధి వేగవంతంగా జరిగే అవకాశం ఉంది.

సాగునీటి రంగం..

సాగునీటి సమస్య పరిష్కారానికి సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ వంటి భారీ ప్రాజెక్టులకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో గోదావరి జలాలు పుష్కలంగా ప్రవహిస్తున్నా సాగు నీరు దక్కని పరిస్థితి. వర్షాకాలంలో వానలు, సాగర్ ఎడమకాలవ మినహాయిస్తే పదిలక్షల ఎకరాలకు సాగునీరు లేని దుస్థితి. రూ.15వేల కోట్లతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఖమ్మంజిల్లాలో గోదావరిజలాలను ఉమ్మడిజిల్లాతోపాటు పొరుగున ఉన్న మహబాద్, సూర్యాపేట జిల్లాలకు తరలించేందుకు సాగర్ ఎడమకాలవకు అనుసంధానం చేసే విధంగా రీడిజైన్ చేసి పనులు ప్రారంభించారు. రూ.2500కోట్లతో సీతమ్మసాగర్ పనులు జరగుతున్నాయి. అయితే పనుల జాప్యం కారణం గా ఈఏడాది కూడా సాగునీరు చూడని పరిస్థితి ఉంది.

మిషన్‌కాకతీయ ద్వారా చెరువులు కళకళలాడుతున్నాయి. భక్తరామదాసు, పాలేరు ఎడమకాలవ ఆధునీకరణ పనులతో పాలేరు నియోజకవర్గం సస్యశ్యామలంగా నిలిచింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జిల్లా నుంచి రోడ్లుభవనాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల నాగేశ్వరరావు రూ.90కోట్లతో ప్రత్యేక దృష్టిపెట్టి భక్తరామదాసు పూర్తిచేయించారు. అయితే సీతారామ సాగునీటి ప్రాజెక్టు పనులు ప్రారంభించినా గత ఐదేళ్లుగా నత్తనడకన సాగాయి. మళ్లీ సీతారామపై ప్రస్తుత ప్రభుత్వం కూడా దృష్టిసారించింది. ఆగస్టు నాటికి ఏన్కూరు లింక్ కెనాల్ పూర్తిచేసి వైరాలోకి గోదావరి జలాలు వదిలే పనులు జరుగుతున్నాయి. అలాగే దుమ్ముగూడెం వద్ద సీతమ్మసాగర్ పేరుతో నీటిని నిలవ ఉంచి పాలేరుకు అనుసంధానం చేసి ఇటు సాగర్ ఆయకట్టును కూడా గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసేందుకు పనులు సాగుతున్నాయి.

ఏదీ పర్యాటక ప్రగతి?

పాలేరు నుంచి పర్ణశాల వరకు పర్యాటక కారిడార్‌గా అభివృద్ధి చేయాలన్నప్రతిపాదన ఉన్నా ఇప్పటివరకు అమల్లోకి రాలేదు. ప్రస్తుత ప్రభుత్వం జిల్లా పర్యాటక రంగంపై ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఉంది. పాలేరు రిజర్వాయర్, నేలకొండపల్లి బుద్ధప్రాజెక్టు, ఖమ్మం ఖిల్లా, వైరా రిజర్వాయర్, ఖమ్మం లకారం, వెలుగుమట్ల ఫారెస్టు పార్కు, కొత్తగూడెంలోని ఇండస్ట్రియల్ ప్రాంతం, భద్రాచలం గోదావరి, పర్ణశాల, భద్రాచలం, జమలాపురం దేవాలయాలు, ఇతర పర్యాటక ప్రదేశాలను కలుపుకుని పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ దిశగా కార్యాచరణ మొదలుపెట్టాల్సి ఉంది.

బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏదీ?

ఉమ్మడి రాష్ట్రంలో బయ్యారం ఉక్కు పరిశ్ర ఏర్పాటు చేసి తద్వారా ఖమ్మం, వరంగల్ జిల్లా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆందోళనలు జరిగాయి. రాష్ట్ర విభజన చట్టంలో కూడా బయ్యారం ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలోనే స్థాపిస్తామని అప్పటి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. పదేళ్లయినా బయ్యారం ఉక్కుపరిశ్రమపై కదలికలేదు. ప్రస్తుత ప్రభుత్వం బయాయరం ఉక్కుపై ఫోకస్ పెట్టి ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పరిశ్రమ పెడితే వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అభివృద్ధి సొగసులు...

రాష్ట్రం సాధించిన తర్వాత ఉమ్మడి జిల్లాకు అభివృద్ధి సొగసులు ఒనగూరాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఖమ్మం ఆధునీకరణ పనులు ప్రారంభం కాగా, రాష్ట్ర విభజన తర్వాత ఖమ్మం నగరం మరింతగా విస్తరించింది. కొత్తగూడెం జిల్లా ఏర్పాటుతో కొత్తగూడెం పట్టణం కూడా అభివృద్ధి దిశగా పయనిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు, భద్రాచలం పట్టణాలకు నిధులు మంజూరుకాగా సెంట్రల్ లైటింగ్ డివైడర్లు ఏర్పాటు చేశారు. పల్లెపట్టణ ప్రగతి ద్వారా మండల కేంద్రాలకు డబుల్‌రోడ్లు వచ్చాయి. జిల్లాలో జాతీయ రహదారులు కింద సుమారు రూ.8వేల కోట్లతో ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి ఆనాటి రోడ్లు భవనాల శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వర రావు చేపట్టిన కృషితో జాతీయ రహదారులు పనులు సాగుతున్నాయి. ఖమ్మం-సూర్యాపేట పనులు పూర్తికాగా, ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-సూర్యాపేట, ఖమ్మం-కోరివి పనులు నడుస్తున్నాయి. విజయవాడ-జగదల్‌పూర్ పనులు పూర్తికాగా భద్రాచలం రెండో వారధి కూడా ఇటీవల ప్రారంభించారు. నాగపూర్-అమరావతి రహదారి పనులు ప్రారంభం కాబోతున్నాయి. అయితే వైరా, కొత్తగూడెం, వైరా-బోనకల్ , ఖమ్మం-బోనకల్ రహధారులను నాలుగులైన్లు గా విస్తరించాల్సిన అవసరం ఉంది. అలాగే ఖమ్మం-ఇల్లెందు రహదారిని కూడా నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలి. పల్లిపాడునుంచి ఏన్కూరువెళ్లే రహదారిని డబుల్‌రహదారిగా అభివృద్ధి చేసే రవాణరంగం మరింత అభివృద్ధి సాధించే అవకాశం ఉంది. ఖమ్మం నగరంలో ఐటీహబ్ ఏర్పాటు చేశారు. రెండో ఐటీహబ్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

భద్రాద్రి, జమలాపురం నోచుకోని అభివృద్ధి

తెలంగాణ రాష్ట్రం వస్తే భద్రాచల ఆలయ అభివృద్ధికి వందకోట్లు ఇస్తామని, జమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని తెలంగాణ తిరుపతి చేస్తామని అప్పటి సీఎం కేసీఆర్ హామి ఇచ్చినా నిధుల కేటాయింపు లేకపోవడంతో ఈరెండు దేవాలయాలు ఎలాంటి అభివృద్ధి సాధించలేదు. స్తంబాద్రి ఆలయ అభివృద్ధి కూడా అంతంతమాత్రమే. అలాగే భద్రాచలం ఆనుకుని ఉన్న యటపాక, పురుషోత్తపట్నం , కన్నాయిగూడెం, పిచుకులపాడు, గుండాల గ్రామ పంచాయతీలు ఏపీలోని మన్యం జిల్లాలో ఉన్నాయి. వీటిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కలిపితే భద్రాచలం అభివృద్ధి సాధ్యమవుతుంది.

మైనింగ్ యూనివర్శిటీ ఏదీ?

కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్శిటీ, ఖమ్మంలో జనరల్ యూనివర్శిటీ ప్రతిపాదన ఉన్నా ఇప్పటి వరకు మంజూరుకు నోచుకోలేదు. పాలేరులో జేఎన్‌టీయూ కళాశాల ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు పూర్తిస్థాయి భవనాలు సిబ్బందిని నియమించలేదు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీని యూనివర్శిటీగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ఈ దిశగా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. అలాగే ఖమ్మం, కొత్తగూడెం మెడికల్ కళాశాలలకు పూర్తిస్థాయి భవనాల నిర్మాణం జరుగుతోంది. ఖమ్మంకు రూ.100కోట్లతో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అశ్వారావుపేటలో హార్టికల్చరల్ హబ్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. జిల్లాలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు అవసరం ఉంది. అలాగే కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్శిటీ ప్రతిపాదన ఎప్పటినుంచో ఉన్నా గత ప్రభుత్వ హయాంలో సాధ్యంకాలేదు. ప్రస్తుత ప్రభుత్వం దీనిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

విద్యుత్‌రంగం...

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత భద్రాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టును మణుగూరు, పినపాక మండలాల సరిహద్దున ఏర్పాటుచేశారు. మొత్తం 4యూనిట్లు పనులు పూర్తయ్యాయి. 1080 మెగావాట్ల ప్రాజెక్టుగాను రూ.8వేలకోట్లు ఖర్చయింది. 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసి భద్రాద్రి పవర్ ప్రాజెక్టు పనులు పూర్తిచేయించారు. అలాగే పాల్వంచలో ఏడవ యూనిట్‌ను 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంలో రూ.5250కోట్లు పనులు పూర్తిచేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధిలో ఈ రెండు ప్రాజెక్టులు కీలకం.

అలాగే దమ్మపేట మండలం అప్పారావుపేటలో ఆయిల్‌పాం పరిశ్రమ రూ100కోట్లతో ఏర్పాటయింది. ఈ ఫ్యాక్టరీ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది. అలాగే సత్తుపల్లి మండలంలోని బుగ్గపాడు వద్ద మెగాఫుడ్‌పార్కుకూడా పూర్తయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు సుమారు రూ.100కోట్లతో మెగాఫుడ్‌పార్కు పూర్తిచేశారు. అయితే వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఉత్పత్తిదారులు రాకపోవడంతో నిరుపయోగంగా ఉంది. ప్రస్తుత ప్రభుత్వం బుగ్గపాడు మెగాఫుడ్ పార్కులో వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్‌కు కసరత్తు చేస్తున్నది. జిల్లాలో మిర్చి, పత్తి, వరి, బొప్పాయి, జామ, పామాయిల్, తదితర ఆహార, వాణిజ్య పంటలు నూనెగింజల పంటలు, పప్పుధాన్యాల పంటలు, పండ్ల తోటలుసాగవుతున్నాయి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు జిల్లాలో చక్కటి సౌలభ్యం ఉంది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు , మహిళ సంఘాలు నిరుద్యోగుల చేత గ్రామ, మండలస్థాయిలో పెడితే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి . జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

తాగునీటి సమస్యకు కొంత పరిష్కారం

ఉమ్మడి జిల్లాలో వేసవి కాలం వస్తుందంటే గిరిజన గ్రామాలు, తండాల్లో తీవ్ర తాగునీటి సమస్య ఉండేది. మిషన్‌భగీరథతో చాలా వరకు సమస్య పరిష్కారం చూసింది. తాగునీటి సమస్య పరిష్కారానికి గోదావరి, కృష్ణాజలాలను తాగునీటికి మళ్లించేందుకు మిషన్ భగీరథ ద్వారా పనులు చేపట్టారు. ప్రధాన ప్రాజెక్టు పనులు పూర్తికాగా ఇంటింటికి తాగునీరు అందించే కార్యక్రమాలు సాగుతున్నాయి. పాలేరు, వైరా ప్రాజెక్టులతో ఖమ్మం జిల్లాకు, మణుగూరులో గోదావరి ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి జిల్లాకు సుమారు రూ.4వేల కోట్లతో గోదావరి, కృష్ణా జలాలను మిషన్‌భగీరథ ద్వారా తాగునీటికి అందిస్తున్నారు. మిషన్‌భగీరథ పూర్తి లక్ష్యం నెరవేర్చేందుకు ప్రస్తుత ప్రభుత్వం దృష్టిపెట్టాలి.

అర్హులందరికీ త్వరలోనే రేషన్ కార్డులు

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, జూన్ 1: గత బీఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరలోనే తెల్లరేషన్ కార్డులను అందజేస్తామని రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలియచేశారు. ఖమ్మంరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మంత్రి పర్యటించారు. స్వయంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మీరుపడ్డ కష్టానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం రావాలని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నామన్నారు. పేదవారికి అవసరమైన రెండు పోర్టు పోలియోల్లో ఉన్నానని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేద వారి కలలు కల్లలయ్యాయన్నారు. పాలేరు నియోజకవర్గం నా సొంత ఇల్లు అని పాలేరు ప్రజల రుణం తీర్చుకునే అవకాశం భగవంతుడు నాకు ఇచ్చాడన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగులశాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, మహ్మద్ మౌలానా, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మద్ది మల్లారెడ్డి, వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, హరినాథ బాబు, దండ్యాల వెంకటేశ్వర్లు, వేణు, పల్లెర్ల పాండు, కిషోర్‌రెడ్డి, సురేష్ నాయక్, వెంపటి రవి పాల్గొన్నారు.

జై భజరంగ భళీ..

» ఘనంగా హనుమజ్జయంతి » భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 1: హనుమజ్జయంతి సందర్భంగా శనివారం ఖమ్మం నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకొని తెల్లవారుజాము నుంచే ఆలయాలకు బారులు తీరారు. దీంతో ఆంజనేయ దేవాలయాల్లో పెద్ద క్యూలు ఏర్పడ్డాయి. నగరంలో పర్ణశాల రామాలయం, కాల్వొడ్డులో గల సత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానం, చెరువుబజార్ దాసాంజనేయస్వామి దేవాలయం, రిక్కాబజార్‌లోని భక్తాంజనేయస్వామి దేవాలయం, గాంధీచౌక్‌లోని ఆంజనేయస్వామి భారీ విగ్రహం, వైరా రోడ్‌లోని జలాంజనేయస్వామి దేవాలయం, పర్ణశాల సీతారామాంజనేయ స్వామి దేవాలయం, బైపాస్‌రోడ్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం, ఎన్నెస్పీ క్యాంపులోని రామాలయం, తదితర చోట్ల విస్తృత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పర్ణశాల రామాలయంలో ఆంజనేయస్వామికి బిందెలతో క్షీరాభిషేకం, కలశాభిషేకం చేశారు. భారీగా అన్నదానం నిర్వహించారు. కాల్వొడ్డు ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి లక్ష తమలపాకులతో పూజ, చెరువు బజార్ దాసాంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి, సువర్చలా దేవి కల్యాణం, సహస్ర నాగవల్లి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని దేవాలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం, భక్తులకు అన్నదానాలు చేశారు.


కాల్వొడ్డు ఆంజనేయస్వామి దేవాలయంలో పూజల్లో భక్తులు

గంజాయి ఉందనే అనుమానంతో...

కారును ఢీకొట్టిన అధికారులు

» కారులో గంజాయి లేకపోవడంతో అవాక్కైన అధికారులు


నుజ్జునుజ్జైన సత్తుపల్లికి చెందిన వ్యక్తి కారు

కారేపల్లి, జూన్1: సత్తుపల్లికి చెందిన ఓ కార్లో గంజాయి రవాణా అవుతుందన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఓ వ్యక్తి కారును ఢీకొట్టిన ఘటన ఇల్లెందు పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. సత్తుపల్లికి చెందిన విజయ్‌కుమార్ అనే వ్యక్తి తన కారులో గంజాయి తరలిస్తున్నరన్న సమాచారం ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అందింది. అప్రమత్తమైన అధికారులు వెంటనే గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ఇల్లెందు నుంచి ఖమ్మం వైపునకు వెళ్తున్న కారును అధికారులు వెంబడించారు. కాగా ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారిపై గల గాంధీనగరం వద్ద రైల్వే గేటు మూసి ఉండడంతో కారులో ఉన్న విజయ్‌కుమార్ తన కారును రివర్స్ చేస్తుండగా, అధికారులు అతడు పారిపోతున్నాడని కారుతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఎవ్వరికి గాయాలు కాలేదు. కారుకు సంబంధించిన వ్యక్తిని అధికారులు తమ వెంట తీసుకెళ్లిన్నట్లు స్థానికులు తెలిపారు. అయితే అతడి కారులో ఎలాంటి గంజాయి లేదని తెలిసింది. తప్పుడు సమాచారంతోనే అధికారులు వెంబడించారని తెలిసింది.

ఈతకు వెళ్లి యువకుడి మృతి


నాగుర్ మృతదేహం

బోనకల్, జూన్ 1: ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా బోనకల్ మండలం చిరునోముల రెవెన్యూ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్ర రాష్ట్రం తిరుపతి జిల్లా, ఓజిలి మండలం ఆర్మేనుపాడు గ్రామానికి చెందిన పానబాక నాగుర్(19) కొన్ని నెలల క్రితం బోనకల్, వత్సవాయి సరిహద్దు ప్రాంతంలో మొక్కజొన్న ఫీడింగ్ స్టాక్ పాయింట్ కోసం జరుగుతున్న భవన నిర్మాణ పనులు చేసేందుకు వచ్చాడు. ఎండ వేడిమికి తట్టుకోలేక, తనతో పాటు పని చేసే సహచరుడితో కలిసి దగ్గరలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు ద్వి చక్ర వాహనంపై వెళ్లారు. ఒకవైపు మిత్రుడు బైక్ పక్కన పెడుతుండగానే, అతడు బావిలోకి దూకాడు. అతడు నీటిలో మునిగి పోతుండగా ఒడ్డున ఉన్న సహచరుడు కర్ర అందించే ప్రయత్నం చేసినా అందుకోలేక పోయాడు. బావి లోతు ఎక్కువగా ఉండటంతో నీట మునిగి మృతి చెందాడు. ఈ సమాచారాన్ని మరో యువకుడు పోలీసులకు అందించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30 కేజీల గంజాయి పట్టివేత

పాల్వంచ, జూన్ 1: అక్రమంగా తరలిస్తున్న 30 కేజీల గంజాయిని పోలీసులు శనివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మూడ కార్తీక్, మూడ వెంకట్రావ్‌లు ఒరిస్సాలో గంజాయిని కొనుగోలు చేశారు. ఎక్కువ ధరకు విజయవాడలో అమ్ముకోవచ్చని భావించి విజయవాడకు ద్విచక్రవాహనంపై బయలుదేరి భద్రాచలం చేరుకున్నారు. అక్కడ నుంచి ఎవ్వరికీ అనుమానం రాకుండా బస్సులో విజయవాడ వైపు బయలుదేరారు. మార్గమధ్యలో పాల్వంచ పట్టణ శివారులో బస్సు దిగారు. సీ-కాలనీ గేటు వద్ద ఉండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వారి కదలికలను అనుమానించి వారివద్ద ఉన్న రెండు బ్యాగులను తనిఖీ చేశారు. కాగా అందులో 14 ప్యాకెట్లలో సుమారు 30 కేజీల ఎండు గంజాయి బయటపడింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.ఏడులక్షల యాభైవేలు ఉంటుందని పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.


గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా..

» రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
» ఐదుగురికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

అశ్వారావుపేట రూరల్, మే 1: దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, ఐదుగురికి గాయాలైన సంఘటన ఆంధ్రాలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రమణక్కపేట వద్ద శనివారం జరిగింది. వివరాల ప్రకారం.. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన దాదాపు పది మంది వ్యక్తులు ఆటోలో ఆంధ్రాలోని చిన తిరుపతి అయిన ద్వారకా తిరుమలకు వెళ్లి మొక్కులు తీర్చుకుని తిరిగి ఇంటికి బయలుదేరారు. మండల సరిహద్దులో జీలుగుమిల్లి మండలంలో ఆటో లారీని ఢీకొంది. ప్రమాదంలో దాసరి రాంబాబు(50), ఉషారాణి, గణేశ్, జయలక్ష్మీతో పాటు మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం రాంబాబు, ఉషారాణిని ఖమ్మం తరలిస్తుండగా రాంబాబు మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఉ క్షతగాత్రులను ఖమ్మం, జంగారెడ్డిగూడెం తరలించి చికిత్స అందిస్తున్నారు. జీలుగుమిల్లి పోలీసులు ఘటనకు సంబంధించి వివరాలు సేకరించారు.

వడదెబ్బతో ముగ్గురి మృతి


రాముడు(ఫైల్)

మధిర టౌన్/ తల్లాడ/ దమ్మపేట, జూన్ 1: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శనివారం వడదెబ్బతో ముగ్గురు మృతి చెందారు. మధిర పట్టణానికి చెందిన హమాలీ వర్కర్ కుంచెం నాగరాజు(49) వడదెబ్బతో మృతి చెందాడు. మద్యానికి బానిసైన నాగరాజు కొంతకాలంగా కుటుంబానికి దూరంగా మధిర సుందరయ్యనగర్‌లోని పాత రూరల్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఓగది అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. శుక్రవారం మద్యం తాగి గదిలో నిద్రపోయాడు. విపరీతమైన ఎండకు తోడు గదిలో వేడికి వడదెబ్బకు గురై మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. తల్లాడ మండలం మంగాపురం గ్రామానికి చెందిన గాదె వెంకటేశ్వర్లు(63) మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పరిసర గ్రామాల్లో సంచరిస్తుంటాడు. శుక్రవారం సాయంత్రం గొల్లగూడెంలో వడదెబ్బకు గురై అతడు స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు వెంటనే ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. దమ్మపేట మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన సోయం రాముడు(56) శుక్రవారం తోటలో పనికి వెళ్లిన అతడు అస్వస్థతకు గురయ్యాడు. శనివారం రాముడు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

రైలు కిందపడి ఇద్దరి ఆత్మహత్య

మధిర, జూన్ 1: గుర్తు తెలియని రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధిర రైల్వేగేట్ సమీపంలో 528/33-31 కిలోమీటర్ వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దెందుకూరుకు చెందిన కొల్లూరు శ్రీను (54) ఎగువ లైన్‌పై వెళ్తున్న గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈమేరకు జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఇన్‌చార్జి వేణుగోపాలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం క్రైం, జూన్ 1: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ఖమ్మం నగరపరిధిలో జరిగింది. ఖమ్మం రూరల్ మండలం గుదిమళ్ల గ్రామానికి చెందిన బానోత్ ప్రసాద్(26)అనే యువకుడు ఇటీవల ప్రేమ వివాహం చేసుకున్నాడు. శనివారం రాత్రి దమ్సలాపురం సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడటంతో రైల్వే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే పోలీసులు సంఘటనాస్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీకి తరలించారు.

వ్యక్తిపై దాడి..

● ఇద్దరిపై కేసు నమోదు..

పాల్వంచ, జూన్ 1: వ్యక్తిపై అకారణంగా దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన కళ్యాణి పున్నంసింగ్ శుక్రవారం పాల్వంచ మండలం జగన్నాథపురం లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న తన స్నేహితుడి ఫంక్షన్‌కు హాజరయ్యాడు. సాయంత్రం సమయంలో అదే ఫంక్షన్‌కు వచ్చిన ఇల్లెందుకు చెందిన విక్కికోరి, నరేష్‌లు మద్యం సేవించి పున్నంసింగ్‌తో వాగ్వాదానికి దిగారు. అంతటితో ఆగకుండా అతడిని అసభ్యపదజాలంతో దూషించడమే కాక, భౌతిక దాడికి పాల్పడి గాయపరిచి చంపుతామని బెదిరించారు. పున్నంసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పోడు భూమిని ఆక్రమించాడని

మాజీ సర్పంచ్‌పై ఫిర్యాదు

రఘునాథపాలెం, జూన్ 1: పోడు పట్టాలు ఉన్న పోడు భూమిని ఆక్రమించాడని..మాజీ బీఆర్ఎస్ సర్పంచ్‌పై ఓ రైతు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రజబ్‌అలీ గ్రామానికి చెందిన లీలాబాయ్ కుమార్తె బాణోత్ లావణ్య పేరుతో ఆర్వోఎఫ్ఆర్ పట్టా నెంబర్ 22100382572 ద్వారా ప్రభుత్వం 7 ఎకరాల పోడు భూములకు పాస్ పుస్తకాలను అందించింది. లబ్ధిదారులే పోడు భూమిని సాగు చేస్తున్నారు. ఇదిలా ఉంటే గత నెల 30న ఇదే పోడు భూమిలో సాగు పనులు చేస్తున్న లీలాబాయ్, కూలీలు భూక్య బాలాజీ, భూక్య మల్సూర్ మరికొందరిపై గ్రామ మాజీ బీఆర్ఎస్ సర్పంచ్ బోడా శరత్, వారి బంధువులు 10 మంది వచ్చి మూకుమ్మడిగా వచ్చి దాడి చేశారని, సాగు భూమిలో పెన్సింగ్‌ను తొలగించారని, రాళ్లను ధ్వంసం చేశారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్-డ్రైవర్ దుర్మరణం

తల్లాడ, జూన్ 1: వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం చెందిన సంఘటన తల్లాడ మండలం మిట్టపల్లి సమీపంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన డ్రైవర్ వక్కల శ్రీనివాస్(36) తిరువూరు నుంచి వరంగల్ వెళ్తున్న వ్యాన్ మిట్టపల్లి సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ క్యాబిన్‌లో డ్రైవర్ శ్రీనివాస్ ఇరుక్కుపోయాడు. తల్లాడ ఎస్ఐ బి.కొండల్‌రావు స్థానికుల సహకారంతో గంటపాటు శ్రమించి అతడిని బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఆమని ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి...

ఖమ్మం రూరల్, జూన్ 1: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, రెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన సంగోజు వీరాచారి(62) శుక్రవారం రాత్రి రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలైన అతడిని స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎద్దు దాడిలో ఒకరు..

దుమ్ముగూడెం, జూన్ 1: ఎద్దు దాడి చేసిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కేరేగుబల్లిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరేగుబల్లికి చెందిన కొర్సా వెంకటేష్(47) అదే గ్రామానికి చెందిన కొర్సా సీతయ్య తన ఎద్దును టేకులపల్లికి చెందిన వ్యక్తికి విక్రయించాడు. దానిని గోదావరి దాటించేందుకు వెంకటేష్ వెళ్లాడు. ఎద్దును తరలిస్తున్న క్రమంలో అది ఒక్కసారిగా అతడిపై దాడి చేసి కిందపడేసి కడుపు, గుండె భాగాలపై తొక్కింది. దీంతో అతడు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు ఆపేందుకు ప్రయత్నించగా వారిపై సైతం ఎద్దు దాడికి యత్నించడంతో వారు భయపడి వెనుదిరిగారు. ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు..

ఖమ్మం క్రైం, జూన్ 1: ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. ప్రకాష్‌నగర్ ప్రాంతంలో నివాసానికి చెందిన కోడి కొమరయ్య(65) వ్యవసాయ మార్కెట్‌లోని హమాలీగా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ప్రకాష్‌నగర్ వద్ద సైకిల్ నడిపించుకుంటూ రోడ్డు దాటుతుండగా వెంకటగిరివైపు నుంచి ఓ ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

భద్రాద్రికి పోటెత్తిన హనుమాన్ భక్తులు

భద్రాచలం, జూన్ 1: భద్రాచలంలో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి హనుమాన్ దీక్షితులు పోటెత్తారు. హనుమాన్ దీక్ష విరమణను పురస్కరించుకొని భద్రాచలానికి మూడు రోజులుగా 60 వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. ఆలయంలో కొలువుదీరిన దాసాంజనేయస్వామికి ఏకాంత విశేష స్నపనం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. పలువురు హనుమాన్ భక్తులు స్వామిని దర్శించి దీక్ష విరమణ గావించారు.

భద్రాద్రి రామాలయానికి ఊహించని రీతిలో హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ప్రసాదాల కౌంటరు వద్ద లడ్డూల కొరత తలెత్తింది.

పర్ణశాలలో బారులు తీరిన భక్తులు

దుమ్ముగూడెం: హనుమన్ జయంతి సందర్భంగా పుణ్యక్షేత్రం పర్ణశాలకు శనివారం హనుమ భక్తులు పోటెత్తారు. సుమారు ఐదువేలకు పైగా భక్తులు పర్ణశాలకు చేరుకొని రాముని దర్శించుకున్నారు. ఆలయ క్యూలైనుతోపాటు, బాపు కుటీరం, నారచీరలు, బోటు షికారు ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి.


రామాలయంలో భక్తుల సందడి

హనుమాన్‌దీక్షితుడికి సీపీఆర్ చేసిన ఆలయ ఎస్‌పీఎఫ్ సిబ్బంది

భద్రాచలం: హనుమన్ జయంతి సందర్భంగా శనివారం భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి వచ్చిన సంగారెడ్డి జిల్లా ఆర్సీపురానికి చెందిన హనుమాన్ భక్తుడు వి.నాగేశ్వరరావు అనే 72 ఏళ్ల వృద్ధుడు స్వామి వారిని దర్శించుకొని అంతరాలయం నుంచి బయటకు వస్తుండగా హటాత్తుగా కిందపడిపోయారు. దీంతో సమీపంలో ఉన్న ఎస్‌పీఎఫ్ సిబ్బంది విజయ్‌సింగ్, ప్రకాష్‌లు అత్యవసరంగా సీపీఆర్ చేసి ప్రాణం పోశారు. అతడి పరిస్థితి నిలకడగా ఉంది.

వైభవంగా బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణం

అన్నపురెడ్డిపల్లి, జూన్ 1: అన్నపురెడ్డిపల్లిలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయంలో ఉదమం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాద చార్యులు సాంప్రదాయ రీతిలో శాస్త్రోక్తంగా పూజలు, అర్చనలు నిర్వహించారు. చుట్టు ప్రకల గ్రామాలకు చెందిన భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారి కళ్యాణం తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ఘనంగా హనుమాన్ జయంతి

పలు చోట్ల వేడుకగా హనుమాన్ శోభాయత్ర

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

పూజలకు భారీగా హాజరైన భక్తజనం

ఇరుముడులు కట్టుకున్న మాలధారులు..

అన్నప్రసాదాలకు పోటెత్తిన భక్తులు

మణుగూరులో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



అశ్వారావుపేటలో నిర్వహించిన శోభాయాత్ర



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు



మణుగూరులో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

హనుమాన్ జయంతిని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల శోభాయాత్ర నిర్వహించారు. ఆలయలు భక్తులతో కిటకిటలాడాయి. మణుగూరులో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అన్నప్రసాదాలకు భక్తులు పోటెత్తారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేట మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఆలయాలు రామనామ స్మరణతో మారుమోగాయి. భక్తులతో ఆలయాలు అన్ని కిటకిటలాడాయి. రామాలయంలో 101సార్లు హనుమాన్ చాలీసాను పఠించి భజనలు నిర్వహించారు. అశ్వారావుపేటలో హనుమాన్‌సేన ఆధ్వర్యంలో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. నందమూరినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు వందలాదిగా తరలివచ్చారు.

జూలూరుపాడులో...

జూలూరుపాడు: హనుమాన్ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. శనివారం వెంగన్నపాలెం, గుండెపుడి, కాకర్ల గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో పాపకొల్లు, పడమటనర్సాపురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో జయంతి వేడుకలు జరిపారు. పాపకొల్లులో శోభాయాత్రను నిర్వహించారు. ఆలయాల్లో హోమాలతో పాటు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు.

మణుగూరులో..

మణుగూరుటౌన్: ఆంజనేయస్వామి జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. మణుగూరు రథం గుట్ట సమీపంలోని సీ-టైప్ కాలనీ క్రాస్‌రోడ్డు వద్దగల అభయాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించగా.. భక్తులు పెద్దఎత్తున హజరయ్యారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. మణుగూరు సీఐ సతీష్‌కుమార్, సింగరేణి ఏరియా ఇన్‌చార్జి జీఎం లక్ష్మీపతిగౌడ్, వాసవీక్లబ్ వ్యవస్థపకులు, ఎస్‌కేటీ గ్రూప్స్ అధినేత దోసపాటి వెంకటేశ్వరరావులు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేడుకల నిర్వహణ కమిటీపై ఆగ్రహం..

హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో వేడుకల నిర్వహణ కమిటీ భక్తుల విషయంలో కొంత నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేడుకల్లో పాల్గొన్న భక్తుల కోసం అన్నప్రసాదాలు అందిస్తామని చెప్పి ప్రచారం నిర్వహించిన కమిటీ సభ్యులు ఆ మేరకు సౌకర్యాలు చేయలేదని మండిపడ్డారు. ప్రతీ ఏడాది హనుమాన్ జయంతి రోజున చేపట్టే అన్నదాన కార్యక్రమంలో జరిగే పొరపాటే ఈ సారి వేడుకల్లోను చోటు చేసుకోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు బహిరంగానే కమిటీ సభ్యులను తిట్టారు.

కొత్తగూడెంలో ఘనంగా..

కొత్తగూడెం సాంస్కృతికం: కొత్తగూడెంలోని హనుమాన్ ఆలయాలు రామరామస్మరణతో మారుమోగాయి హనుమాన్ హనుమంతుడికి సిందూర అభిషేకాలు, తమలపాకులతో అర్చనలు, వడమాలలతో అలంకరణలు... హనుమాన్ చాలీసా పారాయణంతోపాటు.. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో దేవాలయలో అధాయత్మిక శోభ పరిఢవిల్లింది. శనివారం కొత్తగూడెంలోని హనుమాన్ జజయంతిని భక్తులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుఝామున ఆలయాలకు చేరుకున్న భక్తులు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రణమిల్లారు. ఈ సందర్భంగా విశ్వహిందు పరిషత్, భజరంగదళ్, హనుమాను యువసేన ఆధ్వర్యలో కొత్తగూడెంలో సాయంత్రం భారీ శోభోయత్ర నిర్వహించారు. విద్యానగర్ కాలనీలోని హనుమంతుడి ఆలయం వద్ద నుంచి పట్టణంలోని పోసాఫీస్ సెంటరు, బస్టాండ్ స్టాండ్ సెంటరు మీదుగా హనుమాన్ శోభాయాత్ర కొనసాగింది జై శ్రీరామ్ జై హనుమాన్ నామస్మరణతో ఎంతో ఉత్సాహంతో ఈ ర్యాలీ కొనసాగింది. కొత్తగూడెంలోని పలు ఆలయాల్లో వైభవంగా హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశేష పూజలు చేశారు.



వెంగన్నపాలెంలో హోమం



'పేట' అన్నదానంలో పాల్గొన్న భక్తులు



'గూడెం'లో పూజలు



'గూడెం'లో అన్నదానం

నకిలీ విత్తన విక్రయాలపై పీడీ యాక్ట్

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు



రికార్డులు పరిశీలిస్తున్న బాబూరావు

గుండాల, జూన్ 1: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని, రైతులు లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు అన్నారు. శనివారం గుండాల మండల కేంద్రంలో విత్తన దుకాణాల్లో తనిఖీ చేశారు. రికార్డులు, విత్తనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఖరీఫ్‌కు కావల్సిన అన్ని రకాల విత్తనాలు సిద్దంగా ఉంచామని, విత్తనాల కొరత లేదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పత్తి సాగుకోసం రెండు లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు, వరి సాగుకు నలభై వేల క్వింటాళ్ల విత్తనాలు, మిర్చీ ముప్పై రెండు క్వింటాళ్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. లూజు సంచుల్లోని నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులు నష్టపోవద్దని సూచించారు. ప్యాకింగ్‌తో ఉన్న విత్తనాలను తీసుకోవాలని తెలిపారు. ఎరువుల కొనుగోలు సమయంలో బిల్లులు తీసుకోవాలని, విత్తన ప్యాకెట్లను సైతం భద్రపరుచుకోవాలని అన్నారు. తొందరపడి విత్తనాలను నాటటుకోవద్దని వర్షాలు వచ్చాక భూమిలో తేమశాతం ఉన్నప్పుడు విత్తునాటాలని, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఏవో టెక్నికల్ సాయి నారాయణ ఏవో వెంకటరమణ, ఏఈవో బాలరాజు ఉన్నారు.

హనుమజ్జయంతి పాల్గొన్న సాబీర్ పాషా

సుజాతనగర్, జూన్ 1: హనుమాన్ జయంతి కార్యక్రమంలో భాగంగా సుజాతనగర్ మండలంలోని డేగలమడుగు హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజల్లో ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే. సాబీర్ పాషా పాల్గొన్నారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయ కొట్టి స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ సిబ్బంది, గ్రామస్దులు ఆయనను హనుమాన్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. సర్వమతాల సారం ఒక్కటే అని సర్వమత సమ్మేళనమే నా మతం అని అన్నారు. అనంతరం నాయకులగూడెం గ్రామంలో ఓ ఫెర్టిలైజర్ దుకాణాన్ని ప్రారంభించి, రైతుల కోరిక మేరకు వారికి తన చేతుల మీదుగా పత్తి విత్తనాలను అందించారు. రైతులు నాపై ఇంత నమ్మకం కలిగి ఉండటం నా అధృష్టంగా భావిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సంయుక్త కార్యదర్శి కోమారి హనుమంతరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, మండల సహాయ కార్యదర్శి వేల్పుల భాస్కర్, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత మండే నాగేశ్వరరావు, వీర్ల మల్లేష్, దండు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బడి బాటను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

చంద్రుగొండ, జూన్ 1: ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్న బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ ఉపాధ్యాయులను కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అశోక్ ఆధ్వర్యంలో లైన్ డిపార్ట్మెంట్ అధికారులు, ప్రధానోపాధ్యాయుతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 19 వరకు అన్ని ఆవాస ప్రాంతాల్లో బడి బాట నిర్వహించి ఐదు సంవత్సరాల వయసుగల పిల్లలను బడి బాట పట్టించాలని కోరారు. అదే విధంగా బడిలో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్య తదితర అలవెన్స్‌లను తల్లి దండ్రులకు వివరించాలని సూచించారు.

వర్షాలు కురవాలంటూ బోనాలు



బోనాలు తీసుకొస్తున్న మహిళలు

అశ్వారావుపేట, జూన్ 1: మండల పరిధిలోని తిరుమలకుంట గిరిజన వాడలోని మహిళలు వర్షాలు కురవాలంటూ గ్రామదేవతలకు బోనాలు పోసారు. ఈ ఏడాదైన వర్షాలు బాగా కురిసి పంటలు పండాలంటూ గ్రామ దేవతలకు బోనాలు పోసి మొక్కలు సమర్పించుకున్నారు. పొంగళం తయారు చేసి బోనాలు తలకెత్తుకొని గ్రామ నడిబొడ్డున వున్న బొడ్రాయివద్ద, ముత్యాలమ్మ ఆలయం, లక్ష్మీనారాయణ స్వామి, హనుమాన్ ఆలయాల్లో మేళతాళాలతో వెళ్లి బోనాలు సమర్పించారు.

సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి

మణుగూరుటౌన్, జూన్ 1: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తోన్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయుసీ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి గట్టయ్య డిమండ్ చేశారు. శనివారం ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు గుర్రం వినోద్ కుమార్, ఎన్.రాజకోమరయ్యలు ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సమస్యలపై యూనియన్ కార్యాలయంలో గట్టయ్యకు వినతి పత్రం అందజేసి పరిష్కారానిక కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు చెందిన మురళి మాన్‌వపర్ ఏజెన్సీ టెండర్ దక్కించుకుందని, ఇప్పటివరకు గార్డులకు యూనిఫామ్‌లు ఇవ్వలేదని విమర్శించారు. చిరుజీతగాళ్లైన సెక్యూరిటీ గార్డులకు వృత్తి పను మినహాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూరపాక రాములు, జయరాజ్, ఎం శ్రీనివాస్, మల్లేష్, రామకృష్ణ, కోమరయ్య తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ అధికారికి ఇఫ్టూ వినతి...

ఏరియాలోని ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇఫ్టూ ఆద్వర్యంలో సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఏదైన ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులకు వైద్యంతోపాటు వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న సెక్యూరిటీ గార్డులు

ఆవిర్భావ వేడుకలను జయప్రదం చేయాలి: పాయం

మణుగూరుటౌన్, జూన్ 1: పినపాక నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఆదివారం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ధి ఉత్సవాల్లో ప్రతీ పౌరుడు పాల్గొనాలని ఆకాంక్షించారు. దశాబ్ధి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా యువత, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

టేకులపల్లి, జూన్ 1: వినియోగదారులు వస్తు కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా తూనికలు, కొలతల అధికారి కె.మనోహర్ తెలిపారు. శనివారం టేకులపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న వారాంతపు సంతలో కూరగాయలు, పండ్లు, మాంసం ఇతర దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించి తూకపు బాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తూకాలలో వినియోగదారులను మోసాలకు గురిచేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కోటమైసమ్మ తల్లి ఆలయంలో చోరీ

జూలూరుపాడు, జూన్ 1: జూలూరుపాడులోని కోటమైసమ్మ తల్లి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి గడ్డపారతో హుండీని పగలకొట్టి అందులో ఉన్న రూ.10వేల నగదును ఎత్తుకెళ్ళారు. శనివారం తెల్లవారుజామున వాకర్స్ కొంత మంది ఆలయం వైపు వెళ్ళగా చోరి జరిగినట్టు గుర్తించారు. సమాచారాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దీంతో కమిటీ సభ్యులు చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు పిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఆలయాన్ని ఎస్సై జీవన్‌రాజు, ఎఎస్సై తిరపతిరావు వేరువేరుగా సందర్శించి కేసు నమోదు చేశారు.

సంస్థల పరిరక్షణే లక్ష్యంగా ఉద్యమాలు

సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు

కొత్తగూడెం టౌన్, జూన్ 1: ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణే లక్ష్యంగా ప్రజాఉద్యమాలు నిర్వహిస్తామని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తులు ఊడిగం చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో తెలంగాణ సాయుధపోరాట యోధుడు, దివంగత శాసనసభ్యుడు పర్సా సత్యనారాయ శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 150 రైల్వేలైన్లను ప్రైవేటీకరించిందని దీంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కో ల్పోయారని తెలిపారు. అనేక పోరాటాలు చేసి సాధించుక్ను కార్మికుల హక్కులను కాలరాసేవిధంగా చట్టాలు చేస్తుందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని ఆరోపించారు. శ్రామిక మహిళల హక్కుల సైతం కాలరాసే విధంగా ప్రభుత్వం ప్రయత్నిస్తుందని శ్రామిక మహిళా రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమా ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించడం ప్రభుత్వం విఫలమైందని ఆరోపంచారు. శ్రామిక మహిళలకు ఉపాధి అవకాశాల కల్పించడంల నిర్లక్ష్యవైఖరిని నివానలని కోరారు. కార్మికుల హక్కుల కోసం నరంతరం పోరటం సాధించి పర్స సత్యనారాయణ మరిన్ని ఉద్యమాలు నిర్వసిస్తామని తెలిపారు. రైతుసంఘం ఉపాధ్యక్షలు కాసాని అయిలయ్య, వ్యవసాయ కార్మికసంఘం ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య, మెచ్చా వెంకటేశ్వర్లు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మందా నర్సింహారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బ్రహ్మాచారి, ఎజే. రేష్ తదితరులు ప్రసందింగాచ నాయకులు జిలగల పద్మ, డి. వీరన్న, నవీ, పిట్టల అర్జున్, వెంకటమ్మ, ధనలక్ష్మీ, దొడ్డా రవి, సూరం అయిలయ్య, ఎం. పాపరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధం

ఇల్లెందు టౌన్, జూన్ 1: రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సర్వం సిద్ధమైంది. ఆదివారం జరగనున్న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఇల్లెందులోని సింగరేణి సంస్థలో వలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు వేడుకల నిర్వహ ణకు తగిన ఏర్పాట్లు చేశాయి. సింగరేణి ఆధ్వర్యంలో జీకే కేసీ పాఠశాల గ్రౌండ్‌లో ఉత్సవాల నిర్వహణతోపాటు వేదికతోపాటు వివిధ స్టాళ్లను ఆహుతుల కోసం ఏర్పాటు చేశారు.

ఆంజనేయ స్వామికి టీడీపీ నేతల మొక్కు

మణుగూరు, జూన్ 1 : ఆంధ్రాలో చంద్రబాబు నాయుడు సీఎం అయితే వేయి టెంకాయలు కొడతామని మణుగూరులోని తెలుగుదేశం పార్టీ నాయకులు అభయాంజనేయ స్వామికి మొక్కుకున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం మణుగరు పీవీ కాలనీ క్రాస్ రోడ్ వద్ద గల హనుమాన్ దేవాలయం చేరుకున్న టీడీపీ నాయకులు మేదర మెట్ల శ్రీనివాసరావు, సీనియర్ నేత పసునూరి కృష్ణ, సీతమ్మ, మహిళా విభాగ సీనియర్ నాయకురాలు పురిటి విజయలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజల్ని చేశారు. ఈ సందర్భంగా 101 కొబ్బరి కాయలు కొట్టారు.



నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

కరకగూడెం ఎస్ఐ రాజేందర్

కరకగూడెం, జూన్ 1 : మండలంలోని వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కరకగూడెం ఎస్ఐ రాజేందర్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో వాహన తనిఖీలను కరకగూడెం ఎస్ఐ రాజేందర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన దారుల ధృవ పత్రాలను, లైసెన్స్‌లను పరిశీలించిన ఎస్ఐ నేటి నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలపై వాహన దారులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహన దారులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని మైనర్లకు వాహనాలు ఇస్తే రూ.25 వేల వరకు జరిమాన ఉంటుందన్నారు. అంతేకాకుండా 25 సంవత్సరాల వరకు లైసెన్స్ కుడా రద్దు చేయడమే కాకుండా వాహనం రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, వాహనదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వాహన పత్రాలు పరిశీలిస్తున్న ఎస్ఐ

సుభాష్‌నగర్‌లో అర్ధరాత్రి విరిగిన విద్యుత్ స్తంభం

తక్షణమే మరమ్మతులు చేసి విద్యుత్తు పునరుద్దరణ

భద్రాచలం, జూన్ 1: భద్రాచలంలోని సుభాష్‌నగర్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్తు పోల్ విరగడంతో పాటు విద్యుత్తు వైర్లపై చెట్ల కొమ్మలు పడ్డాయి. దీంతో సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది అర్ధరాత్రి 1.30 సమయంలో విద్యుత్తు పోల్‌ను మార్చడంతో పాటు గంటలోపు కాలనీలో విద్యుత్తును పునరుద్దరించారు. విద్యుత్తును పునరుద్దరించిన సిబ్బందిని కాలనీ వాసులు అభినందించారు.

